క్లుప్తంగా

గంజాయి సాగుపై డ్రోన్లతో ఏరియల్ సర్వే



డ్రోన్లతో ఏరియల్ సర్వే నిర్వహిస్తున్న ఎస్ఐ పాపినాయుడు

డుంబ్రిగుడ: మండల పరిధిలోని పంచాయతీల్లో గంజాయి పండించే ప్రదేశాలను డ్రోన్ల సాయంతో ఏరియల్ సర్వే నిర్వహించినట్టు ఎస్ఐ కె.పాపినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం మండలంలోని అనేక ప్రాంతాల్లో ప్రత్యేక బలగాలతో డ్రోన్లతో ఈ ఏరియల్ సర్వే నిర్వహించామన్నారు. గంజాయి పంటతో గాని, గంజాయితో గాని దొరికితే వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా స్పెషల్ పార్టీతో సర్వే నిర్వహించారు.

ఎస్ఐగా సాధిక్ బాధ్యతల స్వీకరణ



స్టేషన్‌లో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న ఎస్ఐ సాధిక్

రంపచోడవరం: రంపచోడవరం ఎస్ఐగా ఎస్‌కె సాధిక్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు సమర్థవంతంగా పనిచేస్తానని చెప్పారు. పోలీసు స్టేషన్‌లో స్థానిక ఆంజనేయస్వామి ఆలయ పూజారి పూజలు చేశారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన మోహన్‌కుమార్ బదిలీపై వెళ్లారు.

కనిగిరి నియామకంపై హర్షం



కనిగిరి దుర్గాప్రసాద్

రాజవొమ్మంగి: వైఎస్సార్‌సీపీ రాజవొమ్మంగి పంచాయతీ ఇన్‌చార్జిగా కనిగిరి దుర్గాప్రసాద్‌ను ఎంపిక చేసినట్టు ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ నుంచి ఆదేశాలు అందినట్టు ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శింగిరెడ్డి రామకృష్ణ ఆదివారం విలేకరులకు తెలిపారు. మండల హెడ్‌క్వార్టర్ రాజవొమ్మంగికి దుర్గాప్రసాద్‌ను పార్టీ ఇన్‌చార్జ్‌గా ఎంపిక చేయడం పట్ల స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. దుర్గప్రసాద్ మాట్లాడుతు పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి ఉంటానని, అందరికి అందుబాటులో ఉంటూ పార్టీతో పాటు ప్రజలకు సేవ చేస్తానని హామీ ఇచ్చారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం



వైద్యాధికారి రాంబాబు

డుంబ్రిగుడ: మండలంలోని విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాదులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని డుంబ్రిగుడ పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రాంబాబు అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, దోమతెరలు వినియోగించాలని సూచించారు. ప్రస్తుతం మలేరియా అదుపులో ఉందన్నారు. నాటు వైద్యానికి దూరంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులపై సిబ్బంది ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జ్వరలు ప్రబలితే తప్పక గ్రామాల్లో వైద్య శిబిరం ఏర్పాటు చేసి గిరిజనులకు మేరుగైన వైద్యం అందిస్తామన్నారు. అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స పొందాలన్నారు.

వాల్మీకి సంఘం నాయకుడి మృతికి సంతాపం



ప్రభాకర్‌రావు(ఫైల్)

గంగవరం: ఏజెన్సీలో వాల్మీకుల, వారి సమస్యలు పరిష్కారానికి ఎంతో కృషి చేసిన బొంకు ప్రభాకర్‌రావు ఆదివారం మృతి చెందారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తరుపున సుదీర్ఘ కాలం పని చేశారు. వాల్మీకుల తరపున హైకోర్టులో కేసు వేసి విజయం సాధించి వారి ప్రయోజనాలు కాపాడినట్టు పలువురు తెలిపారు. వాల్మీకులకు కులధ్రువీకరణ పత్రాలు మంజూరు కోసం విశేష కృషి చేశారన్నారు. వైఎస్సార్‌సీపీలో కూడా క్రియాశీలకంగా పనిచేశారు. ఆయన మృతికి అన్ని పార్టీల నాయకులు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

అధ్వాన దారులు.. తీరని వెతలు



సుజనపేట మార్గంలో కోతకు గురైన కల్వర్టు



సీలేరు మార్గంలో బురదలో కూరుకుపోయిన వాహనాలు

- చినుకు పడితే చిత్తడే
- బురదలో కూరుకుపోతున్న వాహనాలు
- కూలిన కల్వర్టులు
- ప్రమాదాల బారిన వాహనచోదకులు
- పట్టించుకోని అధికారులు

గూడెంకొత్తవీధి: జిల్లా వ్యాప్తంగా రహదారుల అధ్వానంగా మారాయి.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో చాలా చోట్ల రహదారుల పనులు ప్రారంభమయ్యాయి. ఎన్నికల కారణంగా పనులు నిలిచిపోయాయి. అయితే నేటికీ ఆయా పనులు ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధ్వాన దారులతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో రోడ్లన్నీ పెద్దపెద్ద గోతులతో నిండి ఉన్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు గూడెంకొత్తవీధి మండలంలో రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. ప్రధానంగా గూడెంకొత్తవీధి మండల కేంద్రం నుంచి సీలేరు వెళ్లాలంటే ప్రయాణికులు నరకం చూస్తున్నారు. క్షేమంగా ఇంటికి తిరిగి వస్తామన్న నమ్మకం ఉండడం లేదు. భగవంతునిపై భారం వేసి తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యోగులు, వ్యాపారులు రాకపోకలు సాగిస్తున్నారు. మునుపెన్నడూ లేని విధంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సీలేరు మార్గంలో అనేక చోట్ల కల్వర్టులు, వంతెనలు దెబ్బతిన్నాయి. ప్రధాన రహదారిపైకి కొండ చరియలు విరిగిపడ్డాయి. కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్‌ల ఆదేశాలతో వీటన్నింటినీ ఆర్‌అండ్‌బీ అధికారులు యుద్ధప్రాతిపదికన అనేక రోజులు శ్రమించి ఎట్టకేలకు రాకపోకలను పునరుద్ధరించారు. అయినా వంతెనలు, కల్వర్టుల వద్ద పరిస్థితి ఇబ్బందికరంగా మారుతోంది. ఇక్కడ బురద అధికంగా ఉండడంతో అటుగా వెళ్లే భారీ వాహనాలు బురదలో చిక్కుకుపోతున్నాయి. ఇటీవల పాడేరు నుంచి డొంకరాయి వెళ్తున్న ఆర్టీసీ బస్సు లంకపాకలు వద్ద బురదలో చిక్కుకుంది. బయటకు రావడానికి అనేక ప్రయాసాలు పడాల్సి వచ్చింది. ఈ మార్గంలో అనేక చోట్ల పలు వాహనాలు చిక్కుకుని ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అధికారులు బురదమయంగా మారిన ప్రాంతాల్లో సిమెంటు బుగ్గి, క్రష్, లేదా చిప్స్ వేసి రాకపోకలకు వీలుగా అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈసమస్యపై అధికారులు మాట్లాడుతూ వర్షాలు తగ్గిన తరువాత మరమ్మతు పనులు చేపడతామన్నారు.

కోతకు గురైన కల్వర్టు.. రాకపోకలకు ఇక్కట్లు

ముంచంగిపుట్టు: మండలంలో గల కొత్తూరు జంక్షన్ నుంచి సుజనపేట వెళ్లే ఆర్‌అండ్‌బీ మార్గంలో ముత్యాలమ్మ గుడి సమీపంలో ఇటివలే కురిసిన వర్షాలకు కల్వర్టు కోతకు గురై భారీగా రహదారి పాడైయింది. ప్రతి రోజు అధిక సంఖ్యలో వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఏ మాత్రం ఆదమరిస్తే భారీ ప్రమాదం తప్పదు. దీంతో అటుగా రాకపోకులు సాగించే వాహనదారులు నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు చెబుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కోతకు గురైన కల్వర్టు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి,కల్వర్టును బాగు చేసి ప్రమాదాలు జరగకుండా.రాకపోకులు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సుజనకోట పంచాయతీ సర్పంచ్ రమేష్,ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మిలు, వాహనచోదకులు, గ్రామస్తులు కోరుతున్నారు.

రాకపోకలకు అంతరాయం



నిత్యం, రద్దీగా ఉండే అంతర్ రాష్ట్ర రహదారికి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అధ్వానంగా మారడంతో రాకపోకలు తీవ్రంగా అంతరాయం, ఏర్పడుతుంది. రోడ్డుకు మరమ్మతు పనులు చేయలేదు. ఇప్పటికీ 20 రోజులు కావస్తున్నా ఆర్టీసీ బస్సు సర్వీసు లేదు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– వి.విశ్వలింగం, లంకపాకలు గ్రామం, జీకే వీధి మండలం

పోలీసుల తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

పాడేరు : మావోయిస్టుల ఆవిర్భావ మాసోత్సవాల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా పాడేరు–చోడవరం ప్రధాన రహదారి మినుములూరు జంక్షన్ వద్ద ఆదివారం పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. వాహనాల తనిఖీలు చేసి, ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితులను ప్రశ్నించి విడిచిపెట్టారు. మావోయిస్టు ఆవిర్భావ మాసోత్సవాలు ఆక్టోబర్ 20 వరకు జరగనున్నాయి. వాహనదారులు తప్పనిసరిగా రికార్డులను తమ వద్ద ఉంచుకోవాలని పోలీసులు సూచించారు.

200 మందికి వైద్య సేవలు



శిబిరంలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రంపచోడవరం: మండల కేంద్రంలో రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు సుబ్బారావు, శ్రీనివాస్, ఉమామహేష్, సంపత్‌కుమార్‌లు పాల్గొని సుమారు 200 మందికి వైద్య సేవలు అందించారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మాట్లాడుతూ రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఏజెన్సీలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలిపారు.

శ్రమదానంతో పాఠశాలకు ఫెన్సింగ్ ఏర్పాటు



పాఠశాలకు ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

అరకులోయ రూరల్: మండలంలో బస్కి పంచాయతీ దేవరపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నేళ్లగా ఉన్న ఈ సమస్యను ప్రభుత్వం, అధికారులు పటించుకోకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు చందాలు వేసుకుని రూ.30వేలు సమకూర్చారు. ఈ మేరకు ఆయా విరాళంతో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు శ్రమదానంతో పాఠశాల చుట్టూ ఇనుప కంచె (ఫెన్సింగ్) ఏర్పాటుచేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ డొంబుర్‌దార్ మాట్లాడుతూ గతంలో చాలాసార్లు పాఠశాల ప్రహరీ కోసం అధికారులకు వినతులు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. గత్యంతరం విద్యార్థుల తల్లిదండ్రులు సమకూర్చిన చందాలతో పనులు చేపట్టినట్టు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు శాశ్వత ప్రాతిపదికన ప్రహరీ నిర్మించాలని కోరారు. గ్రామస్తులు కృష్ణ, రిబికా, మెశ్య, నగేష్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ మండల కార్యదర్శి ధర్మన్నపడాల్ తదితరులు

జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి పంచాయతీ చిన్నకొత్తూరు గ్రామంలో సీపీఎం శాఖ మహాసభలు జరిగాయి. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి మండల శాఖ కార్యదర్శి సాగిన ధర్మన్నపడాల్ పూలమాలలు వేసి నివాళుర్పించారు. మహాసభలో శాఖ కార్యదర్శి సలుగు సత్తిబాబు శాఖ నివేదికను తెలియజేశారు. భవిష్యత్ కార్యాచరణ రానున్న మూడు సంవత్సరాల కాలంతో పాటు ఈ సమస్యల మీద పోరాటం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు పేర్కొన్నారు. చిన్నకొత్తూరు, గొడుగురాయి, తదితర గ్రామాల్లో రోడ్లు సమస్యలు తాగునీరు, సాగునీరు, పెన్షన్లు, రేషన్‌కార్డులు, ఆర్ఎఫ్ఆర్ఆర్ పట్టాలు వంటి సమస్యలు ఉన్నాయని సభలో చర్చించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కోసం చట్టం తీసుకురావాలని ప్రజా సమస్యలపై ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామని మహాసభలో తీర్మానించారు. నాయకులు సన్యాసిదొర, సంకయ్య, సత్తిబాబు, పిన్నంనాయుడు, నాగభూషణ్ గణపతి, శాంతమ్మ పాల్గొన్నారు

అంగన్‌వాడీ భవనం మంజూరుకు డిమాండ్



బడిమెలలో గ్రామస్తులతో పార్టీ నాయకులు

డుంబ్రిగుడ: మండలంలోని అరమ పంచాయతీ బడిమెల గ్రామంలో అంగన్‌వాడీ భవనం తక్షణమే మంజూరు చేయాలని సీపీఎం నాయకులు పోతురాజు, సూర్యనారాయణలు డిమాండ్ చేశారు. వారు ఆదివారం బడిమెలా గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 110 కుటుంబాలకు చెందిన 470 మంది జనాభా ఉన్నారని , ప్రీ స్కూల్ చిన్నారులు సుమారు 70 మంది వరకు ఉన్నారన్నారు.

అయితే గ్రామంలో అంగన్‌వాడీ భవనం లేక సమీపంలో ఉన్న నందివలస గ్రామం అంగన్‌వాడీ కేంద్రం నుంచి సరకులు పంపిణీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వం యంత్రాంగం స్పందించి బడిమెల గ్రామంలో అంగన్‌వాడీ భవనం తక్షణమే మంజూరు చేయాలని డిమండ్ చేశారు. ఈ సందర్భంగా బడిమెల గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించి సీతారం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు కుమారి, రామకృష్ణ, రామారావు, సద్దు, గోపినాథ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మరింత బలోపేతానికి కృషి



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాంబాబు, నాయకులు

పాడేరు: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదేశాల మేరకు పార్టీ నాయకులు ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు మాట్లాడుతూ ఎంతమంది పార్టీ మారినా వైఎస్సార్‌సీపీకి వచ్చిన నష్టమేమి లేదన్నారు. వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేసి ప్రజల ఓట్లతో ఎన్నికైన ఎంపీపీ, జెడ్పీటీసీ తమ స్వలాభం కోసం, డబ్బులకు ఆశపడి పార్టీ ఫిరాయించడం సిగ్గు చేటన్నారు. తక్షణమే పార్టీ పదవులకు వారు రాజీనామా చేయాలన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో జిల్లాలో పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తామన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, వైస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, డోకులూరు సర్పంచ్ కుర్రబోయిన సన్నిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు సల్లా చిట్టమ్మ, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ లకే రామసత్యవతి, మాజీ సర్పంచ్ కన్నాపాత్రుడు, నాయకులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామ వలంటీర్ల ర్యాలీ

పాడేరు : గ్రామ వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకొని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణంలో భారీ ఎత్తున శాంతియుతంగా ర్యాలీ చేపడుతున్నట్టు గ్రామ వలంటీర్ల అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కొమ్మా రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 10 గంటలకు స్థానిక అంబేడ్కర్ కూడలి నుంచి సినిమాహాల్ సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా ఐటీడీఏ వరకు నిరసన ర్యాలీ చేపడుతామన్నారు. అధిక సంఖ్యలో వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు



దుర్గాదేవి ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ బాలయ్య

చింతపల్లి: మండల కేంద్రంలో గల శ్రీ దుర్గాదేవి నవరాత్రుల మహోత్సవాల కార్యక్రమాలను ఘనంగా ఏర్పాటు చేసేందుకు స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య ఆధ్వర్యంలో ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో సమావేశం ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాలు ఏర్పాటుకు సంబంధించి చేపట్టవలసిన కార్యక్రమాలు సంబంధించి గ్రామపెద్దలు ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. బాలయ్య మాట్లాడుతూ దసరా ఉత్సవ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు చేపట్టేందుకు కమిటీ అన్ని చర్యలు చేపడుతుందన్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సత్తిబాబు, నాయకులు చిన్న, రమేష్, రమణ శ్రీను పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయరూ..



రోడ్డును దాటేందుకు వస్తున్న పిల్లలు

డుంబ్రిగుడ: గోరాపూర్‌లో రైల్వే స్టేషన్ ఉద్యోగుల క్వార్టర్స్ వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుందని, రోడ్డు దాటాలంటే భయంగా ఉంటుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చిన్నారులు పాఠశాల వెళ్లేందుకు రోడ్డు దాటాల్సిన పరిస్థితి ఉందని, ప్రమాదం పొంచి ఉందని భయపడుతున్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగక ముందే ఉన్నతాధికారులు స్పందించి గోరాపూర్ రైల్వేస్టేషన్ పరిధిలోని క్వార్టర్స్ ఇతర ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు వేయాలని వారు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు



ఎల్. హిమగిరి, సీఐ, అరకులోయ

అరకులోయటౌన్: పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని అరకులోయ సీఐ ఎల్.హిమగిరి చెప్పారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం పర్యాటక సీజన్ ప్రారంభమైంది. ఇందులో భాగంగా అరకులోయలో పర్యాటకుల రద్దీ రోజురోజుకు పెరుగుతుందన్నారు. ఇక్కడ హోటళ్లు, రిసార్ట్సులు, లాడ్జీలకు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుందని చెప్పారు. పర్యాటకులు సుదూర ప్రాంతాల నుంచి కార్లు, మినీ బస్సులు, బస్సులు వావానాల్లో వస్తుంటారని, ఈ కారణంగా అరకులోయ పట్టణంలో పార్కింగ్‌కు ఇబ్బందులు తలెత్తే ఆస్కారముందన్నారు. ఈ మేరకు అరకులోయలోని పర్యాటక ప్రాంతాలతో పాటు అనంతగిరి మండలం బొర్రా గుహలు, డుంబ్రిగుడ మండలం చాపరాయి వద్ద పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసి ట్రాఫిక్ క్రమబద్దీకరిస్తామన్నారు. అరకులోయ మండలం గాలికొండ వ్యూపాయింట్, గిరిజన మ్యూజియం, కాఫీ మ్యూజియం, పద్మాపురం గార్డెన్ తదితర ప్రాంతాల్లో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం అరకులోయలో పోలీస్ హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. పట్టణంతో పాటు పర్యాటక ప్రాంతాల్లో రాత్రిళ్లు ప్రత్యేక గస్తీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రమాదకర మలుపులు, జలపాతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. ప్రధాన కూడలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తామన్నారు. పర్యాటక సీజన్‌లో అరకు పోలీస్ సర్కిల్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ, పికెటింగ్‌కు సుమారు 70 మంది వరకు పోలీస్‌లు విధుల్లో ఉంటారన్నారు.

కల్చరల్ ఫెస్టివల్‌కు ఎమ్మెల్యేకు ఆహ్వానం



అరకు ఎమ్మెల్యే మత్స్యలింగంనకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఏకలవ్య పాఠశాల

అరకులోయటౌన్: అరకులోయలోని ఏకలవ్య పాఠశాలలో అక్టోబర్ 3న రాష్ట్రస్థాయి మోడల్ ఏకలవ్య రెసిడెన్షియల్ స్కూల్ 5వ కల్చరల్ ఫెస్ట్ 2024–25 కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ వేడుకకు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను ఆహ్వానించేందుకు ఏకలవ్య పాఠశాల యాజమాన్య ప్రతినిధులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. వేడుకకు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకావాలని అధ్యాపకులు గోవింద్, భారతి, మంగవేణి, విజయభాను తదితరులు కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దినేష్ కుమార్, ఏపీటీడబ్ల్యూ గురుకులం ఏకలవ్య సొసైటీ , గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సదా భార్గవి తదితరులు పాల్గొననున్నట్టు పాఠశాల యాజమాన్య ప్రతినిధులు తెలిపారు.

స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకుడు జగన్‌మోహన్‌రావు

పాడేరు : ఆదివాసీల కోసం స్పెషల్ డీఎస్సీని ప్రభుత్వం ప్రకటించాలని, షెడ్యూల్డ్ ఏరియాలో ఉద్యోగాల భర్తీలో శతశాతం స్థానిక ఆదివాసీలకు దక్కేలా జీవో నెంబర్–3కి చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను తీసుకురావాలని జీవో నెం.3 సాధన కమిటీ జిల్లా అధ్యక్షుడు రావుల జగన్‌మోహన్‌రావు డిమాండ్ చేశారు. స్థానిక పీఎంఆర్సీ భవనంలో జీవో నెం.3 సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, ఆదివాసీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. ఆదివాసీ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన సంఘంతో పాటు 20 ప్రజా సంఘాలు ఉమ్మడి రాష్ట్రంలో జీవో నెం.3కి చటబద్ధత కల్పించాలని కోర్టులో రివ్యూ పిటీషన్ వేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తేకపోవడంతో సుప్రీంకోర్టు రివ్యూ పిటీషన్‌ను డిస్మిస్ చేసిందన్నారు. ఎన్నికల ముందు జీవో నెం.3కి చట్టబద్ధత కల్పిస్తామని చంద్రబాబు స్వయంగా అరకులోయ బహిరంగ సభలో వాగ్దానం చేసి, అధికారంలోకి వచ్చాక ఆ విషయాన్ని పట్టించుకోలేదన్నారు. కూటమీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులైనా జీవో నెం–3 ప్రస్తావనను విస్మరించడం దారుణమన్నారు. జీవో నెం. 3రద్దు చేయడంతో గిరిజన ప్రాంతాల్లో విద్యాలయాలు, ఇతర ప్రభుత్వ శాఖల్లో గిరిజనేతరులు ఉద్యోగాలు పొందుతున్నారని, ఫలితంగా గిరిజనులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. జీవో నెం.3 అమలు కాకపోవడంతో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం కేవలం 6శాతం ఉద్యోగాలు మాత్రమే ఆదివాసీలకు దక్కుతుందన్నారు. జీవో నెం.3కు చట్టబద్ధత కల్పించేలా ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు ప్రతి ఆదివాసీ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘం ప్రతినిధులు కిల్లో సురేంద్ర, బాల్‌దేవ్, మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, నాయకులు రఘునాథ్, బాబూరావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో నిరుపయోగంగా మరుగుదొడ్లు

పెదబయలు: మండల కేంద్రంలో ఐటీడీఏ, జీసీసీ సౌజన్యంతో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులో గత కొంత కాలంగా మరుగుదొడ్లు ఉన్నా వినియోగంలోని లేకపోవడంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు.ఇక్కడున్న మూడు మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం ఉన్నా వినియోగంలోని లేదు.తాళాలు వేసి ఉంటుంది. రోజూ వందల సంఖ్యలో వాహనచోదకులు బంకునకు వస్తుంటారు. అత్యవసరాల కోసం ఇక్కడి మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ సమస్యపై జీసీసీ మేనేజర్ గాసి మాట్లాడుతూ మరుగుదొడ్ల సమస్యను త్వరలో పరిష్కరిస్తామన్నారు.

మనోహరం..ప్రకృతి సోయగం



ఒకవైపు పచ్చని పైరు..మరోవైపు ఆకాశంలో మేఘాలు..వీటి చాటున ప్రవహించే మత్స్యగెడ్డ సోయగం. ఇలాంటి ప్రకృతి అందాలు చూసిన పర్యటకులు మంత్రముగ్ధులవుతున్నారు. సుజనకోట పంచాయితీ మల్లుడుపుట్టు గ్రామ సమీపంలో ఈ అందమైన దృశ్యం కనువిందు చేసింది.

– ముంచంగిపుట్టు